بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ نَحْمَدُهٗ وَنُصَلِّی عَلٰی رَسُوْلِهِ الْکَرِیْمِ وَعَلٰی عَبْدِہِ الْمَسِیْحِ الْمَوْعُوْدِ

**హజ్రత్ అమీరుల్ మొమినీన్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తాలా బినస్రిహిల్ అజీజ్ ఖుత్బా జుమా సారాంశము - బైతుల్ ఫుతూహ్ - లండన్**

దిః 16.05.2014 నజారత్ నష్రో ఇషాఅత్ ఖాదియాన్

తషహ్హుద్, తఅవ్వుజ్, సూర ఫాతిహా పఠనానంతరము హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తాలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ఉపదేశించిరి.

ఆన్‌హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంలో లీనమై హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఖురాన్ ఆదేశములను అర్థము చేసుకొనిరి. అల్లాహ్ ఏకత్వమును గ్రహించిరి. ఎందుకనగా ఆన్‌హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆధారముగా లేనిదే నిజమైన దైవ ఏకత్వమును అర్థము చేసుకోలేము, పవిత్ర ఖురాన్ విద్యను పొందలేము. అందుకే لا اله الا الله తో పాటు محمد رسول الله ను అర్థము చేసుకొనుట అనివార్యము. ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లమే لا اله الا الله కు సరైన ప్రతిరూపము, ఉదాహరణ. నేడు నేను దీని గురించి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం పలు వాక్యములను ప్రవేశపెట్టుతును. నిజమైన దైవ ఏకత్వము ఏమిటో వారు తెలిపిరి. దైవ ఏకత్వమనగానేమి? ఏట్లు నడుచుకొనినచో మానవుడు స్వచ్ఛమైన ఏకారాధకుడగును ?

అన్నాస్ అధ్యాయ విశ్లేషణలో اله الناس ప్రాముఖ్యతను వివరించుచు వారిట్లనిరి. నేను తెలుపదలచినదేమనగా ఈ అధ్యాయములో అల్లాహ్ మొదట رب الناس తర్వాత ملک الناس చివరలో اله الناس తెలిపెను. మానవుని నిజమైన ఉద్దేశము, లక్ష్యము, ఆరాధానార్హున్ని ఇలాహ్ అందురు. لا اله الا الله అనగా అల్లాహ్ తప్ప నాకు మరో ఉద్దేశము, లక్ష్యము, ఆరాధానార్హుడు లేడని అర్థము. ప్రతి ప్రశంస, కీర్తికి అల్లాహ్‌నే అర్హుడని అంగీకరించుటయే నిజమైన దైవ ఏకత్వము. అన్ని రకాల కీర్తనలు, ప్రశంసలు అల్లాహ్‌కే కేటాయించవలెను. అతనికే అవి తగినవి. ఇదే నిజమైన దైవ ఏకత్వము.

لا اله الا الله అనగా కోరికలన్నిటిని పూర్తి చేయువాడు, సర్వ వ్యాధుల నుండి స్వస్థత కల్పించువాడు ఆ ఏకేశ్వరుడేనని నమ్ముట. అప్పుడే దైవ ఏకత్వము సంపూర్ణమగును. ఇలాహ్ అనగా ఉద్దేశిత ఆరాధానార్హుడైన ప్రియమైన ఉనికి అని సూఫీ సంప్రదాయకులు తెలిపిరి. నిస్సందేహంగా ఇదే నిజము. మానవుడు మనస్ఫూర్తిగా ఆచరించనిదే అతనిలో ఇస్లాం ప్రేమ, గొప్పతనము ఏర్పడదు. (لا اله الا الله ను స్వచ్ఛమైన రీతిలో ఆచరించినప్పుడే ఇస్లాం ప్రేమ, గొప్పతనము ఏర్పడును. లేనిచో నోటి మాటలే అగును)

దైవ ఏకత్వ వాస్తవికత, ఒక విశ్వాసుని ప్రమాణమెట్లుండవలెనో తెలుపుచు వారిట్లనిరి. అధికారుల వైపు దృష్టిసారించినవారు వారితో బహుమానములు, బిరుదులు పొందుతురు. వారి హృదయములో వారి గొప్పతనము అల్లాహ్ వైభవముగా ఏర్పడును. వారు వారి ఆరాధానార్హులగుదురు. ఈ విషయమే దైవ ఏకత్వమును అంతము చేయును. (దైవ ఏకత్వ ప్రమాణమును ముగించును) మానవున్ని అతని వాస్తవ లక్ష్యము నుండి దూరము చేయును. వస్తువులు, దైవ ఏకత్వములో వైరుధ్యము ఏర్పడకూడదని సందేశహరులు బోధింతురు. ప్రతిది తమ స్థానములో వుండి తుదకు దైవ ఏకత్వముపై స్థిరపడవలెను. సర్వ గౌరవములు, అవసరాలను అందించేవాడు అల్లాహ్‌యేనని సందేశహరులు మానవులకు బోధింతురు. కావున

అతనికెదురుగా మరొకరిని ఏర్పరచినచో ఇద్దరు ఎదురెదురుగా పోరాడి నప్పుడు ఒకరు తప్పక అంతమగునను విషయము స్పష్టం. కనుక దైవఏకత్వమునకు ప్రధాన్యతనిచ్చుట ముఖ్యము. వస్తువులను ఉపయోగించవలెను కాని వాటినే దేవునిగా నమ్మకూడదు. (వస్తువులను ఉపయోగించుట అనివార్యము. అల్లాహ్ అందించిన వస్తువులు, వసతులను ఉపయోగించుము. కాని వాటికి దైవ స్థానము ఇవ్వకూడదు. దైవ ఏకత్వమునకు ప్రాధాన్యతనివ్వుము) లాభ, నష్టము అల్లాహ్ చేతిలోనే వున్నదని మానవుడు నమ్మినప్పుడు దైవ ఏకత్వము ఏర్పడును. అసలైన ఉపకారి అతడే. ప్రతిది అతని వల్లనే గలదు. మధ్యలో ఎవరు లేరు. మానవుడు ఈ పవిత్ర స్థితిని పొందినప్పుడు నిజమైన దైవ ఏకత్వ ఆరాధకుడనబడును. (పూర్తి నమ్మకము అల్లాహ్‌పై వున్నప్పుడు, మధ్యలో ఎవరు లేనప్పుడు దైవ ఏకత్వ ఆరాధకుడనబడును) దైవ ఏకత్వ ఒక స్థితి ఏమనగా మానవుడు శిల్పాలను, మానవులను లేదా మరో వస్తువును అల్లాహ్ చేయక, వాటికి అల్లాహ్ స్థానమిచ్చుటకు విసుగు చెంది ద్వేషించవలెను. రెండవ స్థితి ఏమనగా వస్తువులను విశ్వసించకూడదు. (అనగా వస్తువులపై పూర్తిగా ఆధారపడి వాటినే సర్వమని భావించకూడదు)

మూడవ రకమేమనగా తన ఆత్మ, ఉనికి ఉద్దేశములను కూడ మధ్యలో నుండి తొలగించవలెను, నిరాకరించవలెను. (దైవ ఏకత్వ మూడవ రకమేమనగా తన ఆత్మను అంతమొందించి, దాని ఉద్దేశములను, స్వార్థములను అంతము చేయవలెను) కొన్ని సార్లు మానవుడు తన నైపుణ్యము, బలమును చూడును. (అనగా అనేక సార్లు మానవుడు కొన్ని పనులలో తన నైపుణ్యము, బలమును నమ్మును) ఫలానా సత్కార్యము నేను నా శక్తితో చేసితిని. ప్రతి పనిని తన శక్తికి అంటగట్టి తన శక్తిని విశ్వసించును. తన శక్తులను కూడ తిరస్కరించినప్పుడే మానవుడు దైవ ఏకత్వ ఆరాధకుడగును.

అనగా ఓ అల్లాహ్! నీవు వారితో ఇట్లనుము. మీకు అల్లాహ్ పట్ల ప్రేమ వున్నచో నన్ను అనుసరింపుము. అప్పుడు అల్లాహ్ మిమ్ములను ప్రేమించును. ఆన్‌హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం సంపూర్ణ విధేయత మానవున్ని ప్రియమైన అల్లాహ్ వరకు చేర్చును. వారు సంపూర్ణ దైవ ఏకత్వ ఆరాధకులని దీనితో తెలియును. యూదులు దైవ ఏకత్వమును విశ్వసించేవారే అయినచో ఇటువంటి ఏకదైవారాధకుని నుండి ఎందుకు దూరముందురు. అల్లాహ్ సర్వోన్నత, అంతిమ ప్రవక్తను నిరాకరించుట, శత్రుత్వము నెరుపుట ప్రమాదకర అంశమని వారికి గుర్తుండవలెను. కాని వారి గ్రంథములో వారి (స) భవిష్యవాణి వున్నను వారు శ్రద్ధ చూపక నిరాకరించిరి. దీనికి ఏకైక కారణము قست قلوبهم వారి హృదయములు కఠినమైనవి.

హజ్రత్ ఈసా అలైహిస్సలాం పట్ల గల తప్పుడు విశ్వాసము గురించి వారిట్లు ఉపదేశించిరి.

ఇస్లాం పరిచయం చేసిన శుద్ధమైన, స్వచ్ఛమైన దైవ ఏకత్వపు ఉదాహరణ నామమాత్రముగా కూడ ఇతర సమాజము, మతములలో కానరాదు. గత గ్రంథములలో దైవ ఏకత్వము ప్రస్తావించబడెను. సందేశహరులందరి అవతరణ ఉద్దేశము, మూలము దైవ ఏకత్వ ప్రచారమేనని కూడ నా విశ్వాసము. కాని ఏ రీతిలో ఖాతముల్ అన్బియా సల్లల్లాహు అలైహి వసల్లం దైవ ఏకత్వమును వివరించిరో, ఏ పద్ధతిలో పవిత్ర ఖురాన్ దైవ ఏకత్వ దశలను విస్పష్టముగా తెలిపెనో మరో గ్రంథములో ముమ్మాటికి కనిపించదు. కావున ఇటువంటి పరిశుభ్రమైన చెలిమను మలినము చేయదలచిరి. (హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంను వ్యతిరేకించే వారు హజ్రత్ ఈసా అలైహిస్సలాం మృతిని అంగీకరించని వారు అల్లాహ్‌కెదురుగా (యేసు (అ) ను) పలు చోట్ల నిలిపిరి. అయినను తమను తాము ముస్లిములమని అందురు.) ఇటువంటి పరిశుభ్రమైన చెలిమను మలినము చేయదలచిన, చేసినప్పుడు ఇస్లాంను కించపరచినట్లు కాదా? ఇంకా వారి దురదృష్టమేమనగా ఆన్‌హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం పరిచయం

చేసిన నిజమైన ఇస్లాం ప్రవేశపెట్టి, మీరు తప్పులో కాలేసినారని పవిత్ర ఖురాన్ ద్వారా నిరూపించబడినప్పుడు మా తాతముత్తాతలు ఇట్లనే నమ్ముచుండేవారని అందురు. కాని నేనిట్లందును. ఈ విధంగా మాట్లాడి వీరు తమను తాము నిర్దోషులుగా భావించగలరా ? కాదు.! పవిత్ర ఖురాన్. అల్లాహ్ ప్రాచీన పద్ధతి ప్రకారము ఈ వాక్యముతో కూడ వీరి ఒక నిదర్శనము పూర్తగును. అల్లాహ్ అవతారుడు, ప్రవక్త ఎప్పుడు వచ్చినా వ్యతిరేకులు ఇటులనే అనిరి.

ما سمعنا بہذا فی اٰبائنا الاولین (అల్ మునినూన్: 25) అనగా మేము మా పూర్వీకులను గూర్చి ఇట్లు వినలేదు. దైవ ఏకత్వము, కారణములను చేర్చుట గూర్చి తెలుపుచు వారిట్లనిరి. నాలుకతో మాత్రమే اشھد ان لا الہ الا اللہ واشھد ان محمد رسول اللہ అనుట దైవ ఏకత్వము కాదు. దైవ వైభవము ఉన్నత రీతిలో హృదయములో నాటుకపోవడమే దైవ ఏకత్వమనబడును. అతని బదులు మరో వస్తువు వైభవము హృదయములో నిలువ కూడదు. ప్రతి కార్యము, అడుగు, నిలుచుటకు మూలము అల్లాహ్ ఉనికేనని భావించవలెను. ప్రతి విషయములో అతనిపై నమ్మకముంచుకోవలెను. అల్లాహ్ తప్ప మరొకరిని ఏ విధంగాను నమ్మకూడదు. అల్లాహ్ ఉనికి. లక్షణములలో ఎటువంటి దానిని చేర్చుటను సమంజసముగా భావించకూడదు. ఉద్దేశమేమనగా నేడు ఎవరు కూడ మానవులను పూజించరు. కాని వస్తువులపై ఆధారపడు వంటి అన్యారాధనను చాలా మంది గ్రహించరు. ఉ॥ పొలమును దున్ననిదే పంట రాదు. పంట రానిదే బ్రతకలేమని రైతు భావించును. ఇటులనే ప్రతి వృత్తిదారుడు తన వృత్తిపై ఈ విధంగానే నమ్మకముంచుకొనును. మేము అది ఇది చేయనిదే జీవితము కష్టతరమని వారు భావించియున్నారు. దీని పేరే వస్తువులపై ఆధారపడుట. అల్లాహ్ శక్తులపై విశ్వాసము లేనందుకే ఈ పరిస్థితి ఏర్పడును. వృత్తిని అటుంచితే అల్లాహ్ అనుమతి లేనిదే జీవితమునకు ఆధారమైన నీరు, ఆహారము, గాలి లాంటి వస్తువులు కూడ మానవునికి ఎలాంటి ప్రయోజనము కలిగించలేవు.

వారి (అ) ఒక దైవవాణి ఇట్లు గలదు. انت منی وانا منک అనగా నీవు నా ద్వారా గలవు. నేను నీ ద్వారా గలను. ఇది దైవ ఏకత్వమునకు విరుద్ధమైనదని ప్రజలు విమర్శింతురు, ప్రశ్నింతురు. انت منی అనగా నా అవతరణ పూర్తిగా అల్లాహ్ దయ, కరుణతోనే గలదు. ఇది పూర్తిగా స్పష్టమైనది. విమర్శ లేదా ఆరోపణకు ఇందులో ఆస్కారము లేదు. (انت منی అనగా లభించినదంతయు అల్లాహ్ దయతో లభించెను. అల్లాహ్ ప్రసాదించెనని దీని అర్థము)

మరల انا منک గురించి హుజూర్ (అ) ఇట్లనిరి. మానవుడు వినమ్రతలో ఉన్నత శిఖరానికి చేరినప్పుడు ఒక నవీన, పవిత్ర జీవితము పొందునని దీని వాస్తవికతను అర్థము చేసుకొనుటకు గుర్తుంచు కోవలెను. అతన్ని ఉద్దేశించి అల్లాహ్ انت منی అని అనును. ఇది అల్లాహ్ సామీప్యము, జ్ఞాన యదార్థమును అర్థము చేసుకున్నాడనుటకు ఒక నిదర్శనము. అల్లాహ్ ఏకత్వ, గౌరవము, వైభవము ప్రత్యక్షమగుటకు మానవుడు ఒక కారణమగును. అల్లాహ్ ఉనికి అతని ద్వారా తెలియును. అల్లాహ్ ఉనికికి దర్పణముగా నుండును. కనుక అతడు దైవ ఉనికికి ఒక ప్రత్యక్ష, సజీవ సాక్షి అగును. అల్లాహ్‌కు దర్పణమైనప్పుడు وانا منک అనును. انا منک పిలుపు పొందిన వ్యక్తి దైవారాధన పూర్తిగా మాయమైనప్పుడు ప్రపంచమునకు వచ్చును. ఇప్పుడు కూడ ప్రపంచములో పాపము, నేరములు చాలా పెరిగిపోయినవి. అల్లాహ్‌ను గుర్తించే, ప్రార్థించే మార్గములు మూసుకుపోయినవి. అందుకే అల్లాహ్ ఈ సంస్థను స్థాపించెను. అల్లాహ్‌ను

మరచిపోయినవారికి అతని ఉనికి గురించి తెలుపుటకు అల్లాహ్ నన్ను కేవలము తన దయ, కరుణతో పంపెను. స్వచ్ఛత, సహనము, విశ్వసనీయతతో ఇటు వచ్చువారికి అల్లాహ్‌ను చూపుటకు కూడ. ఈ కారణముచే అల్లాహ్ నన్నుద్దేశించి انت منی وانا منك అనెను. దైవ ఏకత్వమే ఇస్లాంకు పునాది. మానవునిపై ఎంత ఆపద, కష్టము వచ్చినను అల్లాహ్, అతని ప్రవక్తను నిందించికూడదు. ఎటువంటి బాధ, కష్టము ఎదురైనను ఫిర్యాదు వెలువడకూడదు. మానవునిపై ఆపద అతని మనసు వలన వచ్చును. అల్లాహ్ బాధపెట్టడు. అవును! సత్యులపై కూడ అప్పుడప్పుడు ఆపద వచ్చును. ఇతరులు ఆపదగా భావించినను అది ఆపద కాదు. అది బహుమాన రూపములో ప్రకటితమగును. ఇటుల అల్లాహ్‌తో బంధము ధృఢమగును, వారి హోదా పెరుగును. దీనిని ఇతరులు ఊహించలేరు. అల్లాహ్‌తో సంబంధముండని వారిపై ఆపద వచ్చినప్పుడు వారింకా దుర్మార్గములో పడుదురు. ఇటువంటి వారి గురించే ఇట్లనబడెను.(అల్‌బఖరహ్: 11) فی قلوبهم مرض فزادهم الله مرضا అనగా వారి మనస్సులో రోగమున్నది. కనుక అల్లాహ్ వారి రోగమును మరింత అధికము చేసెను. మీరు అల్లాహ్‌తో బంధము తెంచుకోక సదా భయపడుచు అల్లాహ్ అనుగ్రహమును కోరుము. అల్లాహ్ స్థాపించిన సంస్థలో చేరిన వ్యక్తి అల్లాహ్‌పై ఏ ఉపకారము చేయడు. అతనికీ శుభము కలిగించుట అల్లాహ్ అనుగ్రహమే. ఒక జాతిని అంతము చేసి మరో జాతిని పుట్టించే శక్తి గల వాడతడు. ఈ కాలము లూత్, నూహ్ కాలమును పోలివున్నది. ఒక ఘోర శిక్ష వచ్చి ప్రపంచమును అంతము చేసే బదులు అల్లాహ్ తన దయతో సంస్కరణ కోరి ఈ సంస్థను స్థాపించెను.

ఈ బోధనను అర్థము చేసుకొనుట మన పెద్ద కర్తవ్యము. దైవ ఏకత్వమును గ్రహించుము. తాజా జ్ఞానము లభించినందున తమలో పవిత్ర మార్పు తెచ్చుకొనుట మన సంస్థ అతి పెద్ద బాధ్యత. జ్ఞాన ప్రకటన చేసి ఆచరణ లేనిచో నోటి మాటలే అగును. ఇతరుల అలసట మన సంస్థను నిర్లక్ష్యము, సోమరితనములో పడవేయకూడదు. (ప్రపంచ పోకడలను చూచి వారిని అనుసరించకూడదు) వారిని, వారి ప్రేమను కఠినముగా చూసి కఠినులు కాకూడదు. (ఇతరులకు ధర్మము, అల్లాహ్ గూర్చి ఆసక్తి లేనందున వారిని చూచి హృదయములను కఠినము చేసుకోకూడదు) మానవునికి అనేక కోరికలు, ఆశలుండును. కాని తుది దైవ నిర్ణయము ఎవరికి తెలుసును. జీవితము ఆశల ప్రకారము సాగదు. ఆశలు వేరు, దైవ నిర్ణయము వేరు. దైవ నిర్ణయమే నిజమైనది. అల్లాహ్ వద్ద గల మానవుని జీవిత చరిత్రలే నిజమైనవి. అందులో ఏమి వ్రాసి యున్నదో అతనికేమి తెలుసు. అందుకే పూర్తి శ్రద్ధతో గ్రహించవలెను. సదా విశ్లేషించుకోవలెను. దైవ ఏకత్వ సంపూర్ణ జ్ఞానము అల్లాహ్ మనకు ప్రసాదించుగాక! మన ప్రతి కర్మ దైవ ప్రీతిని పొందుటకే గాక! (ఆమీన్)

హుజూరె అన్వర్ చివరలో సీరియ దేశస్తులు అబ్దుల్ కరీం అబ్బాస్ గారి మరణవార్త తెలిపిరి. వారి సద్గుణములను వివరించి, నమాజ్ తర్వాత వారి పరోక్ష అంత్యక్రియ ప్రార్థన చేయించిరి.

*Summary by Nazarat Nashr-o-Ishat Qadian,*
*Telugu Translation by Hafiz Syed Rasool Niyaz, for Telugu Desk*
*Ahmadiyya Mohalla,Po: Qadian, Dist: Gurdaspur, Pin: 143 516, Punjab*